క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాస ప్రేరకులు సుబ్బారెడ్డి మృతి

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు గ్రామానికి చెందిన వ్యక్తిత్వ వికాస ప్రేరకులు పోకల సుబ్బారెడ్డి శనివారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయన గతంలో ఓ దినపత్రికలో 15 సంవత్సరాలు పాత్రికేయులుగా పనిచేసి అనంతరం పలువురికి ఆయన ఉపన్యాసంతో ఉజ్వల భవిష్యత్తును అందించాలని ఆకాంక్షించి విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో మందికి వ్యక్తిత్వ వికాసాలు అందించారు. ఈయన మృతి పట్ల పలువురు అభిమానులు, బంధువులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆదివారం బి.కోడూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుండెపోటుతో యువకుడు మృతి


వెంకటసుబ్బయ్య (ఫైల్)

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్ సమీపంలో శనివారం గుండెపోటుతో ఓ యువకుడు మృతిచెందాడు. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం గ్రామం రంగంపల్లికాలనీకి చెందిన వాకమళ్లవెంకటసుబ్బయ్య (34) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్య శశికళతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే గతేడాది ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో వెంకటసుబ్బయ్యపై నమోదైన కేసు శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు బద్వేలుకు వచ్చాడు. కోర్టులో హాజరై కేసు కొట్టివేసిన అనంతరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో సమాచారమిచ్చేందుకు వెళుతుండగా స్టేషన్ సమీపంలో కిందపడిపోయాడు. వెంటనే ఆయన బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళగా మృతిచెందినట్లు తెలిపారు. ఘటనపై మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

సన్మానం


శారద, నాగశయనంను సన్మానిస్తున్న నరసింహారావు

ప్రొద్దుటూరు : నందవరం చౌడేశ్వరిదేవి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియమితులైన వుట్టి శారదను, ఆమె భర్త, దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనంను శనివారం దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాగా నరసింహారావు, హనుమాన్ నగర్ శ్రీరామలింగ చౌడేశ్వరి దేవస్థానం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాగా పెద్ద నరసింహులు, రాగా వీరయ్య, అల్లి చంద్రశేఖర్, దేవరశెట్టి కొండయ్య, గిద్దలూరు సుబ్బరాయుడు, గిద్దలూరు రమణ, గిద్దలూరు బాలగంగాధర్, మచ్చా ఆదినారాయణ, చంటి, ముని తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


సీఐ నాగభూషణంను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

రాజుపాళెం : ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మార్గమని ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ వెంకటరమణ అన్నారు. మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు శనివారం సీఐ, ఎస్ఐ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సీఐ, ఎస్ఐలకు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఆలయ ఆవరణలో, సంజీవరాయ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మి నారాయణ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు పాల్గొన్నారు. అలాగే సంజీవరాయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి చాగలమర్రి మండలంలోని పెద్దబోధనానికి చెందిన సంజీవ కుమార్ రాజు దంపతులు రూ.25,116 విరాళంగా ఇచ్చారు. వారికి శాలువ కప్పి పూలమాల వేశారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్రొద్దుటూరు : ప్రజా సామస్యలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరైనప్పటికీ కమిషనర్ అనూహ్యంగా సభను వదిలి వెళ్లిపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కోరం సభ్యులు ఉన్న సందర్భాల్లో సభను నడిపే హక్కు చైర్‌పర్సన్‌కు ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమన్నారు. చట్టబద్ధమైన సమావేశానికి చట్టబద్ధత లేదని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సమావేశాన్ని కమిషనర్ వదిలి వెళ్లపోవడంపై అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. చివరికి గత్యంతరం లేక సభను కొనసాగించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ప్రొద్దుటూరులో ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి కాలేదన్నారు.

ఎత్తిపోతల పథకం పూర్తయ్యేనా?

- ఎడారిని తలపిస్తున్న చెరువులు
- అడుగంటిపోయిన భూగర్భజలాలు
- అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు
- ఆందోళనలో రైతులు


ముళ్లపొదలతో నిండిన వరికుంట్ల చెరువు

కాశినాయన : రైతన్నకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడునోట్ల శని అన్న చందంగా తయారైంది వారి పరిస్థితి. ఆయకట్టు చెరువులకు సాగు నీరు అందించేందుకు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినా సగం పనులు పూర్తి చేసినా ఇప్పటికీ చుక్క నీరు అందని పరిస్థితి. ఒక పక్క, మరో పక్క అనావృష్టి, చీడ పీడలు, నకిలీ విత్తనాలు, పురుగు మందులు ఎలా ఎదో ఒక రకంగా రైతులను నట్టేట ముంచుతున్నాయి. దీనికితోడు వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల్లో నీటి మట్టం తగ్గడంతో పంటలు సాగు చేయని పరిస్థితి. వర్షాలు అరకొరగా కురవడంతో మండలంలోని చెరువులు ఏటా ఎండుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నాయకులు మేము అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీళ్లు అందిస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేసినా ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను అసంపూర్తిగానే ఉన్నాయి. పూర్తి చేస్తామని చెప్పిన నాయకులు దానిపై దృష్టి సారించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.45 కోట్ల పనులు

మండలంలోని వరికుంట్ల, బాలాయపల్లె, గంగనపల్లె, గొంటువారిపల్లె, కొండ్రాజుపల్లె, ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె చెరువుల కింద 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వార్షాభావంతో పొలాలు బీళ్లుబారడంతో 2023లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు రూ.45 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా తెలుగు గంగ ఎడమ కాలువ ద్వారా మొదటగా వరికుంట్ల, గొంటువవారిపల్లె, బాలాయపల్లె, గంగనపల్లె చెరువులకు నీళ్లు అందించేందుకు పైపు లైన్ పనులు పూర్తయ్యాయి. 70 శాతం పూర్తయిన పనులు ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. అప్పట్లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు రూ.7 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. ఆ నిధులు మంజూరైతే పని పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ చెబుతున్నారు.

పక్కనే నీరు ఉన్నా..

బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పోరుమామిళ్ల చెరువుకు వదిలారు. పక్కనే ఆ నీరు పల్లెల మీదుగా వెళుతున్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావుల్లో నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు వ్యవసాయం మానుకుని బెంగళూరు, పూణె, హైదరాబాద్ ప్రాంతాలకు వలసలు వెళ్లారు. కొంత మంది రైతులు అరకొరగా వస్తున్న బోరు నీటితో పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి నాయకులు స్పందించి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయించి చెరువులకు నీళ్లు అందించాలని రైతులు కోరారు.

పనులు పూర్తి చేయాలి



అర్ధాంతరంగా ఆగిపోయిన ఎత్తి పోతల పథకం పూర్తి చేసి చెరువులకు నీళ్లు అందించాలి. బోరుబావుల్లో నీటి మట్టం తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తిపోతుల పథకం పూర్తయితే బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రజాప్రతినిధులు చెరువులకు నీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– జి.హనుమంతురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కాశినాయన మండలం

చెరువులకు నీళ్లు అందించాలి



బోరుబావుల కింద పంటలను సాగు చేద్దామనుకుంటే నీరు అడుగంటిపోయి బోరుబావుల్లో నీరు రాక వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు అందిస్తే పంటల పండించుకునేందుకు అవకాశం ఉంటుంది. చాలా మంది రైతులు బెంగళూరు, హైదరాబాద్‌కు వలసలు వెళ్లి అక్కడ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి చెరువులకు నీళ్లు అందించాలి.

– పిచ్చిరెడ్డి, సర్పంచ్, గొంటువారిపల్లె, కాశినాయన మండలం

నరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు.

వ్యక్తిత్వ వికాసం యువత భవిష్యత్తుకు మూలాధారం


మాట్లాడుతున్న స్వామితురియానంద సరస్వతి

బద్వేలు అర్బన్ : యువత భవిష్యత్తులో ముందుకు సాగాలంటే వ్యక్తిత్వ వికాసం చాలా అవసరమని చిన్మయ మిషన్ కడప శాఖ అధ్యక్షుడు స్వామితురియానందసరస్వతి అన్నారు. శనివారం స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో యువతలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఒడిదుడుకులను ఎదుర్కొని జీవనం సాగించాలంటే గీతాపారాయణం ఒక దిక్సూచి అని అన్నారు. రాచాపూడినాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ బాలఓబులేసు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు అంకయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత లేదనడం విడ్డూరం

మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ఈనెల 9వ తేదీ జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత లేదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి విమర్శించారు. మున్సిపల్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదానికి దిగి మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే తన వెంట తీసుకెళ్లారన్నారు. సమావేశం మధ్యలో కమిషనర్ వెళ్లిపోయిన విషయాన్ని తాము కౌన్సిల్ హాల్‌లోనే ఉండి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కలెక్టర్, ఆర్డీ కమిషనర్‌ను మందలించి సమావేశానికి మరుసటి రోజు పంపారని, అంతే తప్పా తాము ప్రాధేయపడి కమిషనర్‌ను పిలవలేదన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఏనాడైనా ఎగ్జిబిషన్ వేలం పాట జరిగిందా అని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రశ్నించారు. తామందరం కౌన్సిల్‌లోనే ఉన్నామని, ఎమ్మెల్యే వెంట ఉన్న 16 మంది కౌన్సిలర్లు సమావేశానికి రాలేదని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ముందు రోజు సమావేశం జరుగుతుండగా వెళ్లిపోయిన మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ అవర్స్ అయిపోయాయని చైర్‌పర్సన్‌కు సమాధానం ఇచ్చారన్నారు. ఎగ్జిబిషన్ వేలానికి సంబంధించి ఆమోదం పొందేందుకు శుక్రవారం రాత్రి 8 గంటలకు ఎలా కమిషనర్ చైర్‌పర్సన్ వద్దకు వచ్చారన్నారు. అప్పుడు ఆఫీస్ అవర్స్ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. కౌన్సిల్‌కు చైర్‌పర్సన్ సుప్రీం అని ఆమె చెప్పినట్లే పరిపాలన సాగుతుందని పేర్కొన్నారు.

ప్రమాణం ఎలా చేయిస్తారు?

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల తలలపై దేవుని పటాలను పెట్టించి ఎలా ప్రమాణం చేయిస్తావని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని పాతకోట బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. అలా చేయడానికి మీకు హక్కు ఉందా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు కనీసం యూరియా సక్రమంగా అందించలేకపోతున్నారని, ఒక్క పూటైనా రైతుల వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూవజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి భూమి పూజ

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె చెరువుకు తెలుగుగంగ ఎడమ కాలువ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించేందుకు శనివారం టీడీపీ బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి, బీజేపీ నాయకుడు బొజ్జ రోశన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సావిశెట్టిపల్లె, ఇటుకలపాడు, కొండ్రాజుపల్లెకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఆరు నెలల్లో ఈ పథకాన్ని పూర్తి చేసి 5వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గురివిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పంగా రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం


లోక్ అదాలత్‌లో రాజీ అయిన కక్షిదారులకు అవార్డు ఫారం అందజేస్తున్న న్యాయమూర్తులు

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సందర్భంగా రెండు బెంచిలను ఏర్పాటు చేసి 1379 క్రిమినల్ కేసులు, 18 సివిల్ కేసులు చొప్పున మొత్తం 1397 కేసులు పరిష్కరించి రూ.59,68,587లు బాధితులకు అందజేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1800 కేసులు పరిష్కారం

మైదుకూరు : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1800 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయవాది షేక్ ఖాజామొయినుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి కక్షిదారుల పరస్పర అంగీకారంతో రూ.17,08,066 విలువైన 1800 కేసులను పరిష్కరించారు.

చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు లభించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. శనివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొప్పర్తిలోని సీపీ ప్లస్ – ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళా మీ జీవితంలో ఒక మలుపు కావచ్చున్నారు. క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తే మీరు మంచి ఉన్నతస్థాయికి చేరుకోగలరని తెలిపారు. మహిళలకు ఉచిత హాస్టల్, భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. పురుషులకు అదనంగా ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగాయన్నారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడే మనస్తత్వం ఉంటే ఏదీ సాధ్యం కాదన్నారు. ఈ రోజు మీరు వేసే చిన్న అడుగులు రేపటి గొప్ప విజయాలకు పునాది వేస్తాయన్నారు. నిరాశ చెందకుండా ముందుకు సాగాలని, మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తా మణికంఠ రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, టీకూరుపేట సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కాశినాయన మండల కన్వీనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్ బాషా, యూత్ లీడర్ చిత్తాగిరి ప్రణీత్‌రెడ్డి, పెనల గణేష్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, నాగేళ్ల అనిల్‌కుమార్‌రెడ్డి, కోడూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ సేల్ ప్రారంభం


జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ సేల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ సేల్‌ను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోయాలుక్కాస్ జ్యువెలరీ సంస్థ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 165 బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి ఐఎస్ఓ సర్టిఫై పొందిన నాణ్యమైన ఆభరణాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందడం జరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు అవసరమైన రీతిలో వివిధ రకాల డిజైన్స్‌తో కూడిన ఆభరణాలు అందిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ సేల్‌లో ఆభరణాలు పరిశీలించి మొదటగా కొనుగోలు చేసిన మహిళకు ఎమ్మెల్యే చేతులమీదుగా ఆభరణాలు అందించారు. అలాగే ఎమ్మెల్యేను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా కార్యదర్శులు పోలిరెడ్డి, నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, బి.కోడూరు మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, గోపవరం జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, మున్సిపాలిటీ నాయకులు కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, కుప్పాలరమణ, రఘురామిరెడ్డి, జోయాలుక్కాస్ మేనేజర్ ప్రిత్రీష్‌జోసెఫ్, అసిస్టెంట్ మేనేజర్ సతీష్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ రంతుబాష తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లు లీకేజీ

కలుషితమవుతున్న తాగునీరు


పోలిరెడ్డిపేటలో అసంపూర్తిగా వదిలేసిన పైపులైను

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లె పంచాయతీ పోలిరెడ్డిపేట, రాచాయపేట గ్రామాల్లో తాగునీటి పైపులు లీకేజీ అవుతున్నాయి. దీంతో వచ్చే నీరంతా తిరిగి పైపులైన్లలోకి వెళుతుండటంతో తాగునీరు కలుషితమవుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోలిరెడ్డిపేటలో పైపులైను అమర్చేందుకు జేసీబీ ద్వారా గాడి తీశారు. పైపులైను దెబ్బతినడంతో వచ్చే నీరంతా గాడిలోనే నిల్వ ఉంటోంది. తిరిగి ఆ నీళ్ళే పైపులోకి వెళుతున్నాయి. పైపులైను లీకేజీని అరికట్టి మట్టిని పూడ్చాల్సి ఉండగా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే రాచాయపేటలో తాగునీటి పథకానికి వెళ్ళే పైపు లైను లీకేజీ అవుతుంది. అక్కడ కూడా తిరిగి మురికి నీరంతా పైపులోకి వెళుతున్నాయి. ఇక్కడ కూడా లీకేజీని అరికట్టేందుకు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రెండు గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి ఉపయోగించుకునేందుకు పనికిరాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు స్థానికులు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన తాగునీరు తాగడం వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైపులైను లీకేజీని అరికట్టి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

చెరువులకు నీరు అందించాలి


లిఫ్ట్‌ఇరిగేషన్ మోటార్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కలసపాడు : ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిన తెల్లపాడు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి వారం లోగా చెరువులకు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి దూలంవారిపల్లె వద్ద ఉన్న లిఫ్ట్‌ఇరిగేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల ప్రాంతమైన కలసపాడు మండలంలోని తెల్లపాడు, ఎగువ తంబళ్ళపల్లె, ఎగువ రామాపురం గ్రామ పంచాయతీల పరిధిలోని తడుకుచెరువు, తిక్కమ్మచెరువు, మేలకుంట చెరువు, రంపకుంటచెరువు, దూలంవారిపల్లె చెరువు తదితర చెరువులకు నీటిని నింపడం కోసం గత ప్రభుత్వం రూ.17 కోట్లతో ఎత్తిపోతల పథకం చేపట్టి రైతులకు నీరు అందించిందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల నుండి మోటార్లు పనిచేయక కాలువ నిండా నీరు పోతున్నా చెరువులకు చుక్క నీరు ఇవ్వకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారన్నారు. 15 గ్రామాల ప్రజలు కరువు కాటకాలతో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్, ఏరియా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, జాకోబ్, బాష, రైతులు పాల్గొన్నారు.

రైతులపై కక్ష సాధింపు మానుకోండి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డి




అట్లూరు : టీడీపీ నాయకులు రైతులపై కక్ష సాధింపు చర్యలను మానుకొని నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపి తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి తెలిపారు. శనివారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో రూ.18 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీళ్లు అందించామన్నారు. కలసపాడు మండలం తెల్లపాడు గ్రామ పంచాయతీలో తెలుగు గంగ ఎడమ కాలువ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించి తడుకువాగు చెరువు, తిక్కమ చెరువు, మేలకుంట చెరువు, దూలంవారిపల్లె చెరువు తదితర ఏడు చెరువులను నీటితో నింపామన్నారు. దీంతో తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించామన్నారు. కాశినాయన మండలంలోని అనేక గ్రామాల రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాశినాయన మండలం గంగనపల్లి వద్ద రూ.14 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసిందన్నారు. రూ.11 కోట్ల వరకు పనులు పూర్తి చేశామని, ఇంకా రూ.3కోట్ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. గంగనపల్లి నుంచి వరికుంట్ల, బాలాయపల్లి, నాయునిపల్లి దాదాపు 5వేల ఎకరాలకు నీళ్లు అందించే ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం, టీడీపీ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వారు మేల్కొని రైతులు, ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలని కోరారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు

బద్వేలు అర్బన్ : ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సగిలిబాలయ్య, కొడవటిగంటి సుదర్శన్‌లతో పాటు మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్.వెంకటసుబ్బయ్యలను శనివారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు యర్రబల్లెఓబయ్య మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి సార్థకత తీసుకువచ్చే ఉపాధ్యాయ వృత్తిలో మరింత రాణించి జాతిబిడ్డలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు దేవానందం, జాకోబ్, ఓసూరిభాస్కర్, జాలాగురయ్య, జయచంద్రబాబు, తలారిరత్నం, సుమన్, బాలయ్య, ప్రజా సంఘాల నాయకుల పిచ్చయ్య, ప్రసాద్, గ్రేసియస్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో శనివారం కళాశాల ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. చదువులో, వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగభూషణ శర్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును జిల్లా చేయాలి


ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి నాయకులకు సంఘీభావం తెలుపుతున్న ఏపీ ఎన్జీఓలు

మైదుకూరు : ప్రొద్దుటూరును జిల్లాగా చేయాలని ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మైదుకూరులో శనివారం ఏపీ ఎన్జీఓ మైదుకూరు తాలూకా సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు జిల్లా సాధనకు మద్దతుగా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సమితి జేఏసీ కన్వీనర్ డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు జిల్లా సాధనకు అందరూ మద్దతు తెలిపాలని కోరారు. న్యాయవాది సీవీ సురేష్ మాట్లాడుతూ ప్రొద్దుటూరును జిల్లా చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రొద్దుటూరు ఎన్జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు జిల్లా చేయడం వల్ల ప్రభుత్వానికి అదనపు భారం ఏమి పడదని ఉదాహరణలతో తెలిపారు. సమితి నాయకులు ఎస్ఆర్‌పీ జనార్థన్‌రెడ్డి, స్పందన రాంప్రసాద్‌రెడ్డి, భాస్కర్ రావు, ఏపీ ఎన్జీఓ మైదుకూరు తాలూకా అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మాచనూరు రాఘవయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడితే అటు పారిశ్రామికంగా, ఇటు వ్యవసాయపరంగా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. జీవ, ప్రకృతి వైవిధ్యం, ఘనమైన సాంస్కృతిక రాజకీయ వారసత్వం కలిగిన ప్రొద్దుటూరును జిల్లాగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.